

అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: అన్నప్రసాద వితరణ పథకానికి హైదరాబాద్, సికింద్రాబాద్‌కు చెందిన రఘు కుమార్, పి.సుజాత రూ.1,11,116, రూ.1,01,116 చొప్పున విరాళాన్ని అందజేశారు.



పల్లకీ ఉత్సవం

శ్రీశైలంటెంపుల్: పౌర్ణమిని పురస్కరించుకుని స్వామిఅమ్మవార్లకు శనివారం పల్లకీ ఉత్సవాన్ని నిర్వహించారు. భ్రమరాంబాదేవికి ఊయలసేవ చేశారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,625
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:73
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:1,03,745
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:1,527

న్యూస్‌రీల్

జాయింట్ కలెక్టర్‌గా విష్ణుచరణ్



నంద్యాల: నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్‌గా సి.విష్ణుచరణ్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నిరబ్‌కుమార్ ప్రసాద్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. పార్వతీపురం జిల్లాలో ఐటీడీఏ పీఓగా పనిచేస్తున్న 2019 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఈయన బదిలీపై నంద్యాల జేసీగా రానున్నారు. ఇక్కడ పనిచేస్తున్న టి.రాహుల్‌కుమార్‌రెడ్డిని సీతంపేట ఐటీడీఏ పీఓగా బదిలీ చేశారు. రాహుల్‌కుమార్‌రెడ్డి నంద్యాల జిల్లాలో 11 నెలల పాటు జాయింట్ కలెక్టర్‌గా పనిచేశారు.

సుబ్రమణ్యేశ్వరుడి ఆదాయం రూ.23.74 లక్షలు



కానుకలు లెక్కిస్తున్న దృశ్యం

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయంలో హుండీ లెక్కింపు నిర్వహించినట్లు ఈఓ రామక్రిష్ణ శనివారం తెలిపారు. లెక్కింపులో భాగంగా నగదు రూ.23,74,402.. 3గ్రాముల 97మిల్లీ గ్రాముల బంగారం, 1కేజీ 427 గ్రాముల వెండిని భక్తులు సమర్పించారన్నారు. గత మార్చి 30వ తేదీ నుంచి స్వామివారికి భక్తులు సమర్పించిన నగదు, ఇతర వస్తువులను లెక్కించామన్నారు. దేవదాయశాఖ నంద్యాల అధికారి ఛక్రిభరత్ పర్యవేణ అధికారిగా వ్యవహరించారన్నారు.

రుద్రవరంలో భారీ వర్షం

నంద్యాల(సెంట్రల్): జిల్లాలో శుక్రవారం ఉదయం నుంచి శనివారం వరకు ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. అత్యధికంగా రుద్రవరంలో 70.6 మి.మీ, అత్యల్పంగా శ్రీశైలంలో 5 మి.మీ వర్షపాతం నమోదైంది. భారీ వర్షాలతో వందలాది ఎకరాల్లో మినుము, మొక్క జొన్న పంటలు నీట మునిగాయి. మొలకదశలో ఉన్న పంటలు కుళ్లిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. దొర్నిపాడులో 66.2, బనగానపల్లెలో 47.8, నంద్యాలలో 47.2, పాణ్యంలో 46.4, మహానందిలో 45.8, బండిఆత్మకూరులో 43.6, ఆళ్లగడ్డలో 41, కోవెలకుంట్లలో 40, శిరివెళ్లలో 39, గోస్పాడులో 35.2, నందికొట్కూరులో 32.2, బేతంచర్లలో 27.4, పగిడ్యాలలో 24.8, సంజామలలో 24, ప్యాపిలిలో 18.2, డోన్‌లో 12.4, కొలిమిగుండ్లలో 8.6 మి.మీ. వర్షపాతం నమోదైంది.

వర్షం వస్తే.. బకెట్లు పెట్టాల్సిందే!



ప్యాపిలి: స్థానిక తహసీల్దార్ కార్యాలయం చిన్నపాటి వర్షం వస్తే పైకప్పు నుంచి వర్షపు నీరు కారుతోంది. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి పైకప్పు నుంచి నీరు కారుతుండటంతో కార్యాలయ సిబ్బంది ఇలా బకెట్లు పెట్టారు. బ్రిటీష్ కాలంలో నిర్మించిన తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. దశాబ్దాలుగా మరమ్మతులు చేపట్టకపోవడంతో పైకప్పు కలప దూలాలు కూడా విరిగిపోతున్నాయి. దీంతో కార్యాలయంలోని రెండు గదులను వాడకుండా వదిలేశారు. వర్షానికి కారుతుండటంతో కార్యాలయంలో భద్రపరిచిన ఫైళ్లు కూడా తడిసే ప్రమాదం ఉంది. ప్రభుత్వం స్పందించి తహసీల్దార్ కార్యాలయం మరమ్మతుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

అసాంఘిక శక్తులే అసలైన సవాల్!

కర్నూలు, నంద్యాల జిల్లా ఎస్పీలకు కొత్త సవాళ్లు




- టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆదాయమార్గాలపై నేతల దృష్టి
- రెండు జిల్లాల్లో విచ్చలవిడిగా పేకాట, నాటుసారా, మట్కా
- ఆళ్లగడ్డ పాలకేంద్రం, దొర్నిపాడులో 'భూమా' గోడౌన్‌లోనే పేకాట
- ఏళ్ల తరబడి స్టేషన్‌లో పాతుకుపోయిన కానిస్టేబుళ్లతో 'అసాంఘిక శక్తులకు' సత్సంబంధాలు
- ఉమ్మడి జిల్లాలో 26 గ్రామాల్లో ప్రధానంగా నాటుసారా తయారీ
- మరో వంద గ్రామాల్లో నాటు ఘాటు.. అవుకు, ఆత్మకూరు మండలాల్లో అధికం
- కొత్త ఎస్పీల రాకతో నాటుసారా బట్టీలు, పేకాటపై దాడులు

తెలుగుదేశం పార్టీ అధికారం చేపట్టిన తర్వాత 'అసాంఘిక శక్తులు' చెలరేగుతున్నాయి. నాటుసారా, మట్కా, పేకాట అధికారపార్టీ నేతల కనుసన్నల్లో విచ్చలవిడిగా సాగుతోంది. పోలీసులు కాదు ఎవరొచ్చినా ఏం చేయలేరనే రీతిలో బరితెగించారు.

సాక్షి ప్రతినిధి, కర్నూలు: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మట్కా నడుస్తోంది. గతంలో రతన్ మట్కా వారానికి ఐదురోజులు జరిగేది. ఇప్పుడు కళ్యాణ్, సత్తా మట్కాలు ఆరురోజులు జరుగుతున్నాయి. ఈ మాట్కాకు నెంబర్లు గుజరాత్, ముంబయి నుంచి ఆన్‌లైన్‌లో వస్తాయి. ఇవి కాకుండా కర్నూలులో కొందరు ప్రైవేటు వ్యక్తులు కూడా మట్కా నడుపుతున్నారు. ఈ మట్కా ఆదివారం కూడా నడుస్తోంది. కళ్యాణ్, సత్తా మట్కాలు సాయంత్రం 5గంటల వరకూ చీటీలకు డబ్బులు తీసుకుంటారు. రాత్రి 9.15కు ఓపెన్, రాత్రి 11.15కు క్లోజ్ నెంబరు ప్రకటిస్తారు. ఆ వెంటనే బ్రాకెట్ నెంబరు రిలీజ్ చేస్తారు. కర్నూలు సిటీలోని అన్ని స్టేషన్ల పరిధిలో మట్కాబీటర్లు అధికం. ఇక్కడ ఎవరు మట్కా నిర్వహిస్తారు? మట్కా బీటర్లు ఎవరనే సంగతి ఇక్కడి పోలీసులకు క్షుణ్ణంగా తెలుసు. అయినా మట్కా నిర్వహణకు బ్రేక్ వేయలేకపోతున్నారు. దీనికి కారణం ఇక్కడి పోలీసులతో ఉన్న సత్సంబంధాలే! ఏళ్ల తరబడి కానిస్టేబుళ్లు ఒకే స్టేషన్‌కే పరిమితం కావడంతో వీరితో మంచి సంబంధాలు ఉన్నాయి. మట్కాపై సీఐలు ఆరాతీసినా కానిస్టేబుళ్లు కచ్చితమైన సమాచారం ఇవ్వరు. దీంతో

ఆళ్లగడ్డ పాలకేంద్రంలో పేకాట నడుస్తోంది. దొర్నిపాడులో 'భూమా' గోడౌన్‌లో యథేచ్ఛగా పేకాట ఆడిస్తున్నారు. ఇతర జిల్లాల నుంచి ఇక్కడికి వస్తున్నారు. గురువారం పోలీసులు తనిఖీలు చేసి 20మందిని అదుపులోకి తీసుకున్నారు.

- ఇస్రేనాయక్ తండా పరిధిలో కంబగిరి స్వామి ఆలయ సమీపంలోని 'ఎర్రమల అడవుల్లో' రోజూ రూ.50–60లక్షలు పేకాట నడుస్తోంది.
- నంద్యాలలోని ఓ పోలీసు అధికారికి మొన్నటి వరకూ రోజూ రూ.2లక్షలు ఇక్కడి నుంచి పంపేవారు.
- ఓర్వకల్లు రాక్ గార్డెన్, సుంకేసుల, పోతిరెడ్డిపాడులోనూ పేకాట యథేచ్ఛగా నడుస్తోంది.
- కర్నూలులో మట్కాడాన్ ఆధ్వర్యంలో యథేచ్ఛగా మట్కా నడుస్తోంది.
- నంద్యాలలోని బర్మశాలలో, నూనెపల్లిలో మట్కా నిర్వహిస్తున్నారు. ఇక్కడ కూడా త్రీటౌన్ పోలీసులకు ఎక్కడెక్కడ మట్కా చీటీలు రాస్తారు? ఎంత మొత్తంలో లావాదేవీలు జరుగుతున్నాయి? ఎవరెవరు కీలకంగా వ్యవహరిస్తున్నారు అనే విషయాలు స్పష్టంగా తెలుసు. ప్రతీనెలా ఈ స్టేషన్‌కు మామూళ్లు ముడుతుండటంతోనే పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.



అవుకు మండలం గడ్డమేకలపల్లి, ఇస్రేనాయక్‌తండా, కొండమనాయునిపల్లి, పిక్కిళ్లపల్లితండాలో విచ్చలవిడిగా నాటుసారా కాస్తున్నారు. నంద్యాల జిల్లాతో పాటు వైఎస్సార్ జిల్లాకు కూడా సరఫరా అవుతోంది. తుగ్గలి, ఆలూరు మండలాల పరిధిలోని రోళ్లపాడు, అరికెర, ఆదోని, సింగరాయకొండ, కల్లూరు, కర్నూలు సిటీలోని బంగారుపేటలో విచ్చలవిడిగా నాటుసారా కాస్తున్నారు. అయినా నియంత్రణ కొరవడింది. దీనికి కారణం బట్టీ నిర్వాహకులతో పోలీసులకు సత్సంబంధాలు ఉండటమే.



కొందరు ఎస్‌ఐలు, సీఐలు కూడా ఇందులో భాగస్వాములవుతున్నారు. కర్నూలులో మాట్కా నిర్వాహకుల వద్ద రెగ్యులర్‌గా మట్కా రాసేవాళ్లు కొంత డబ్బు వారివద్దే ఉంచి, రోజూ ఫోన్‌లో ఏ నెంబర్‌పై ఎంత రాయాలి? అని చెబుతున్నారు. వీరు వారానికో, పదిరోజులకో ఒకసారి వచ్చి డబ్బులు ఇచ్చి వెళుతున్నారు. నెలవారీ మామూళ్లతో కొన్ని స్టేషన్లు జూద కేంద్రాలపై కన్నెత్తి చూడటం లేదు. మట్కా రాయుళ్ల నుంచి ఒక్కో స్టేషన్‌కు నెలకు రూ.50వేల నుంచి రూ.లక్ష వరకూ మామూళ్లు వస్తున్నట్లు తెలుస్తోంది. దీంతోనే మట్కారాయుళ్లు చీటీలు రాస్తున్నా, వారు ఎక్కడ రాస్తున్నారనే సమాచారం ఉన్నా పట్టించుకోవడం లేదు.

అధికారుల అండతోనే నాటు వ్యాపారం

నాటుసారా కర్నూలు జిల్లాలో జోరుగా సాగడం వెనుక అధికారుల హస్తం ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లాలో నాటుసారా వ్యాపారం రోజుకు రూ.60–70లక్షలు జరుగుతోంది. అంటే నెలకు రూ.18కోట్లు పైబడి వస్తోంది. మరో రెండు నెలల్లో రోజుకు రూ.కోటి చొప్పున నెలకు రూ.30కోట్లకు చేరే అవకాశం ఉంది. ఇందులో అధికారులకు భారీగా మామూళ్లు ఇస్తున్నట్లు తెలుస్తోంది. సారాతో పాటు బెల్లం వ్యాపారంలో కూడా భారీగా లాభాలు ఆర్జిస్తున్నారు. సారా కాచేందుకు చిత్తూరు జిల్లా నుంచి నల్లబెల్లం సరఫరా అవుతోంది. అరగొండ మినహా జిల్లా మొత్తం నల్లబెల్లంతో తయారీ చేస్తారు. దీనిపై గతంలో నిషేధం ఉండేది. రైతులు నష్టపోతారని నిషేధం ఎత్తేశారు. దీంతో నల్లబెల్లం ఎక్కువగా దిగుమతి అవుతోంది. బెల్లాన్ని జిల్లాలోని అవుకు, కొలిమిగుండ్లకు చెందిన ఇద్దరు వ్యక్తులు సరఫరా చేస్తున్నారు. సారా తయారీలో నల్లబెల్లం, తుమ్మచెక్కతో పాటు నిషేధిత గుట్కాలు, పాతచెప్పులు, దగ్గుకు వినియోగించే కోరెక్స్ సిరప్‌తో పాటు క్లోరోఫాంను కూడా కలుపుతున్నట్లు తెలుస్తోంది. కష్టపడి పనిచేసే కూలీలు ఎక్కువగా సారాను తాగుతున్నారు. వీరంతా ఇలాంటి కల్తీసారాను తాగి ఆరోగ్యాన్ని గుల్ల చేసుకుంటున్నారు. ఈక్రమంలో కొత్త పోలీస్‌బాస్‌లు బిందుమాధవ్, అధిరాజ్‌రాణాలకు అసాంఘిక శక్తులే సవాల్‌గా మారాయి. మరి వీటి నియంత్రణపై పూర్తి స్థాయిలో దృష్టి సారిస్తారో? లేదో? వేచి చూడాలి.



రెండు జిల్లాల్లో మళ్లీ విచ్చలవిడిగా నాటుసారా ఊట

గత ప్రభుత్వ హయాంలో బెల్ట్‌షాపులను పూర్తిగా రద్దు చేసేందుకు ప్రభుత్వమే మద్యం దుకాణాలను నడిపింది. దీంతో ఎక్కడా బెల్ట్‌షాపులు లేవు. అదేవిధంగా నాటుసారాను నివారించేందుకు అప్పటి ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకుంది. మద్యం అందుబాటులో లేకపోవడంతో పల్లెలు ప్రశాంతంగా ఉండేవి. ఎలాంటి గొడవలు జరగలేదు. గత నెలలో టీడీపీ ప్రభుత్వం కొలువుదీరింది. దీంతో పల్లెల్లో 'నాటుసారా' వ్యాపారాన్ని అనుకూలంగా మలుచుకున్నారు. 'నాటు'ను నియంత్రించాల్సిన పోలీసులు, ఎక్సైజ్ అధికారులు చర్యలకు ఉపక్రమించలేదు. కొన్ని స్టేషన్లకు నెలమామూళ్లతో సంతృప్తిపరిస్తే మరికొన్ని చోట్ల అధికారజులుం నడుస్తోంది. రెండు జిల్లాల్లో 26 గ్రామాల్లో నాటుసారా విచ్చలవిడిగా కాస్తున్నారు. బనగానపల్లి, డోన్, శ్రీశైలం, పత్తికొండ, కర్నూలు జిల్లాల పరిధిలోని ప్యాపిలి, కొండమనాయునిపల్లి, అలేబాతండా, సిద్ధాపురం, జేఎం తండా, పీఎం తండా, బంగారుపేటలో ఎక్కువగా కాస్తున్నారు. వీటి నుంచి ఇతర ప్రాంతాలకు ఎగుమతి కూడా అవుతోంది. ఇవి కాకుండా మరో వంద గ్రామాల్లో నాటుసారా కాస్తున్నారు. వీటిపై సెబ్, సివిల్ పోలీసులు దృష్టి సారించలేదు.

దారి తప్పుతున్న దర్యాప్తు!

- కొలిక్కి రాని బాలిక హత్యాచారం కేసు
- ఘటన జరిగి 14 రోజులైనా లభించని మృతదేహం
- విచారణ పేరుతో రోజుకొకరిని అదుపులోకి తీసుకుని చిత్రహింసలు పెడుతున్న పోలీసులు
- సాక్ష్యం పక్కాగా లేకుంటే నిందితులకు కఠిన శిక్ష పడడం అనుమానమే అంటున్న న్యాయ నిపుణులు

సాక్షి, నంద్యాల: తొమ్మిదేళ్ల మైనర్ బాలిక హత్యాచారం కేసులో పోలీసుల దర్యాప్తు దారితప్పుతోందన్న అనుమానాలు బలపడుతున్నాయి. ఘటన జరిగి 14 రోజులు గడుస్తున్నా కేసులో పురోగతి కనిపించడం లేదు. ఘాతుకానికి పాల్పడిన ముగ్గురు మైనర్ బాలురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్న పోలీసులకు నిందితులు చుక్కలు చూపిస్తున్నారు. తప్పుడు సమాచారం ఇస్తూ ముప్పుతిప్పలు పెడుతున్నారు. రోజుకో కట్టుకథ అల్లి వినిపిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ ఘటనలో ఇప్పటివరకు ముగ్గురు ప్రధాన నిందితులతో పాటు మరో ఇద్దరిని మాత్రమే అరెస్ట్ చూపారు.

ఒక అడుగు ముందుకు రెండు అడుగులు వెనక్కి...

ముచ్చుమర్రి కేసులో ఆశించిన మేర పురోగతి కనిపించడం లేదు. ఈ నెల 16వ తేదీ జిల్లా ఎస్పీ అదిరాజ్ సింగ్ నందికొట్కూరులో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి కేసు గురించి వివరించారు. ముగ్గురు బాలురిని అదుపులోకి తీసుకోవడంతో పాటు ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. మరోవైపు విచారణ పేరుతో రోజుకొకరిని అదుపులోకి తీసుకుని చిత్రహింసలు పెడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఘటనతో సంబంధం లేకున్నా స్టేషన్‌కు తీసుకెళ్లి చావబాదుతున్నారని కొందరు కన్నీటి పర్యంతమవుతున్నారు. కేసు బలంగా ఉండేందుకు అవసరమైన సాక్ష్యాధారాలను సేకరించడంలో నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. బాలిక హత్యాచారానికి గురై రెండు వారాలు గడిచినా మృతదేహం లభ్యం కాకపోవడం గమనార్హం.

బలమైన సాక్ష్యాలు లభించేనా?

మరోవైపు కేసు రోజుకో మలుపు తీసుకుంటోంది. ఇప్పటివరకు ఐదుగురిని మాత్రమే పోలీసులు అరెస్ట్ చేశారు. మరికొంత మందిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. అయితే విచారణ సరైన మార్గంలో సాగడం లేదని ప్రజా సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. పోలీసుల అదుపులో ఉన్న అనుమానితుడు యెహాన్ అలియాస్ హుస్సేన్(36) శనివారం లాకప్‌డెత్‌కు గురైనట్లు వార్తలు రావడం కలకలం రేపుతోంది. పోలీసుల విచారణలో బలమైన సాక్ష్యాధారాలు లభించడం అనుమానంగానే ఉందని ప్రజా సంఘాల నాయకులు చెబుతున్నారు. పక్కా ఆధారాలు లేనిపక్షంలో నిందితులు తప్పించుకునే అవకాశం ఉందని న్యాయ నిపుణులు అంటున్నారు.

నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న ప్రభుత్వం

కేసుపై కూటమి ప్రభుత్వం మొదటి నుంచి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. బాలిక అదృశ్యమైన తర్వాత విచారణలో అత్యాచారం చేసి చంపేసిన వార్త దావానంలా వ్యాపించినా ప్రభుత్వం నుంచి కనీస స్పందన కరువైంది. వారం రోజుల తర్వాత హోంమంత్రి అనిత స్పందించి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. ఈ మొత్తాన్ని కూడా బాధితులకు అందజేసేందుకు మూడు రోజుల సమయం పట్టింది. జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఇద్దరు మంత్రులు ఎన్‌ఎండీ ఫరూక్, బీసీ జనార్దన్ రెడ్డి ఈ ఘటనపై స్పందించకపోవడం విమర్శలకు తావిస్తోంది.

నిందితుల 'దర్జా'

ఒకరు మంత్రి వెంట పండుగ సంబరాల్లో సందడి

- మరొకరు ఏకంగా జిల్లా ఎస్పీని కలిసి బొకే
- బెయిల్ రాకమునుపే టీడీపీ నేతలకు నాలుగో సింహం సెల్యూట్
- సామాజిక మాధ్యమాల్లో ఫొటోలు హల్‌చల్
- నిందితులు పరారీలో ఉన్నారంటూ బొంకుతున్న పోలీసులు



మంత్రి ఫరూక్‌తో టీడీపీ నాయకుడు ఏవీ సుబ్బారెడ్డి



నంద్యాల జిల్లా ఎస్పీకి బొకే ఇస్తున్న ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అఖిలప్రియ భర్త భార్గవ్‌రామ్

ఆళ్లగడ్డ: పోలీసుల 'పచ్చ'పాతం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. నిందితులు కళ్లెదుటే తిరుగుతున్నా పరారీలో ఉన్నారంటూ బొంకుతున్నారు. ఒక నిందితుడు మంత్రితో కలిసి కార్యక్రమాల్లో పాల్గొంటుంటే.. మరొకరు ఏకంగా ఎస్పీనే కలిసి బొకే ఇచ్చినా పోలీసులు మౌనం దాల్చడం అధికార పార్టీ విషయంలో ఆ శాఖ తీరు ఇట్టే అర్థమవుతోంది. దౌర్జన్యాలు చేసినా, హత్యలు, హత్యాయత్నాలకు పాల్పడినా నిందితులు దర్జాగా కాలరెగరేసుకు తిరుగుతున్నా పట్టించుకోకపోవడం గమనార్హం. గత నెల 25న టీడీపీకి చెందిన శ్రీదేవి దారుణ హత్యకుగురైంది. ఈ కేసులో టీడీపీకి చెందిన రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఏవీ సుబ్బారెడ్డి ప్రధాన నిందితుడని బాధిత కుటుంబ సభ్యులు కేసు పెట్టడంతో ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదైంది. ఈ కేసులో కొందరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించగా ఏవీ సుబ్బారెడ్డి పరారీలో ఉన్నట్లు పోలీసులు ప్రకటించారు. అయితే హత్య కేసులో నిందితుడిగా ఉండి బెయిల్ కూడా రాని ఏవీ సుబ్బారెడ్డి శుక్రవారం మంత్రి ఫరూక్‌తో కలిసి నంద్యాల మండలం ఊడుమాల్పురం గ్రామంలో మొహర్రం వేడుకల్లో పాల్గొన్నారు. మంత్రితో పాటు పదుల సంఖ్యలో ఉన్న పోలీస్ అధికారుల సమక్షంలో దర్జాగా వేడుకల్లో పాలుపంచుకున్నారు. వేడుకల్లో పాల్గొన్న ఏవీ సుబ్బారెడ్డి ఫొటోలు సామాజిక మాధ్యమాలతో పాటు న్యూస్ పేపర్లలో కూడా ప్రచురితమైనప్పటికీ ఏవీ సుబ్బారెడ్డి తప్పించుకు తిరుగుతున్నారని పోలీసులు చెబుతుండటం గమనార్హం.

హత్యాయత్నం కేసులో నిందితుడు.. అయినా ఎస్పీకి పూల బొకే

ఈ నెల 12వ తేదీ వైఎస్సార్‌సీపీ కార్యకర్త చాకలి శీను మోటర్ సైకిల్‌పై వెళ్తుండగా టీడీపీ శ్రేణులు ఢీకొట్టి, దాడి చేసి కిడ్నాప్ చేశారు. అనంతరం విచక్షణా రహితంగా కొట్టి పట్టణ శివారులో పడేశారు. ఈ కేసుకు సంబంధించి ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ భర్త భార్గవరామ్ ప్రధాన సూత్రధారి అని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆయనపై హత్యాయత్నం కేసు నమోదైంది. నిందితుల కోసం గాలిస్తున్నామని పోలీసులు చెబుతున్నప్పటికీ శుక్రవారం హత్యాయత్నం కేసులో నిందితుడిగా ఉన్న భార్గవరామ్ ఎస్పీ అదిరాజ్‌సింగ్ రాణాను కలిసి బొకే ఇవ్వడం, ఈ ఫొటోలు సోషల్ మీడియాలో హల్ చేశాయి. ఈ రెండు ఘటనలు చాలు రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థ ఎంత బాగా పని చేస్తుందో అని జిల్లా ప్రజలు చర్చించుకుంటున్నారు.

తహసీల్దార్లను పూర్వ జిల్లాలకు పంపండి

- కలెక్టర్లను ఆదేశించిన సీసీఎల్ఏ

కర్నూలు(సెంట్రల్): ఎన్నికల ముందు ఇతర జిల్లాలకు బదిలీ చేసిన తహసీల్దార్లను పూర్వ జిల్లాలకు బదిలీ చేయాలని సీసీఎల్ఏ శనివారం కలెక్టర్లను ఆదేశాలు ఇచ్చింది. దీంతో కలెక్టర్లు వారిని రిలీవ్ చేసేందుకు చర్యలు చేపట్టారు. గతంలో ఉమ్మడి కర్నూలు జిల్లాలో పనిచేస్తున్న 61 మంది తహసీల్దార్లు ఉమ్మడి అనంతపురం, చిత్తూరు, వైఎస్ఆర్ కడప జిల్లాలకు బదిలీ అయ్యారు. ఇందులో కర్నూలుకు సంబంధించి 30, నంద్యాలకు సంబంధించి 31 మంది ఉన్నారు. కాగా, ఉమ్మడి అనంతపురం, వైఎస్ఆర్ కడప, చిత్తూరు జిల్లాల్లో పనిచేస్తున్న తహసీల్దార్లను ఉమ్మడి కర్నూలు జిల్లాలకు కేటాయించారు. వీరిని కర్నూలు, నంద్యాల జిల్లాల కలెక్టర్లు రిలీవ్ చేసేందుకు చర్యలు చేపట్టారు. ఆయా జిల్లాల్లో రిలీవ్ అయిన తహసీల్దార్లు కేటాయించిన జిల్లా కలెక్టర్‌కు రిపోర్టు చేసుకోవాల్సి ఉంటుంది. అక్కడి నుంచి తిరిగి కలెక్టర్ వారిని మండలాలకు కేటాయిస్తారు.


జెడ్పీలో కారుణ్య నియామకాలు

కర్నూలు(అర్బన్): జిల్లా పరిషత్ యాజమాన్య పరిధిలో ఖాళీగా ఉన్న కార్యాలయ సహాయకుల (ఆఫీసు సబార్డినేట్స్) పోస్టుల భర్తీకి సంబంధించి కారుణ్య నియామకాల్లో భాగంగా ఐదుగురికి ఉద్యోగాలు కల్పించారు. ఈ మేరకు శనివారం జెడ్పీలోని తన చాంబర్‌లో ఉద్యోగాలు పొందిన ఐదుగురికి చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి నియామక పత్రాలను అందించారు. ఉద్యోగాలు పొందిన టీ శివనారాయణకు ఎంపీపీ, కొలిమిగుండ్ల, షేక్ హసీనాకు పాణ్యం మండలం బలపనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వై శ్రావణ్‌కుమార్‌కు ఎంపీపీ, బండిఆత్మకూరు, టీ తరుణ్‌కు జెడ్పీ కర్నూలు, కే నిర్మల్‌కుమార్‌కు ఎంపీపీ నందికొట్కూరుకు పోస్టింగ్స్ ఇచ్చారు.

టీబీ డ్యాంకు భారీగా ఇన్‌ఫ్లో

- ఏ క్షణంలోనైనా గేట్లు ఎత్తే అవకాశం
- నదీ పరివాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక

హొళగుంద: కర్ణాటకలోని హోస్పేట్ వద్ద నిర్మించిన తుంగభద్ర జలాశయానికి ఇన్‌ఫ్లో భారీగా వస్తోంది. ఈ నేపథ్యంలో ఏ క్షణంలోనైనా డ్యాం గేట్లు ఎత్తి దిగువన ఉన్న తుంగభద్ర నదికి నీటి విడుదల చేసే అవకాశాలున్నట్లు టీబీ బోర్డు అధికారులు శనివారం తెలిపారు. డ్యాం పరిధిలో వచ్చే ఆయా జిల్లాధికారులు నదీతీర ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ప్రజలు అప్రమత్తం ఉండాలని చేయాలని సూచించారు. శనివారం సాయంత్రం సమయానికి 1,03,956 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉండగా అవుట్ ఫ్లో 2,739 క్యూసెక్కులుంది. ఆదివారం ఉదయం నాటికి 1,633 అడుగుల డ్యాం పూర్తి మట్టానికి 1625 అడుగులతో 105.788 టీఎంసీల నీటి సామర్థ్యానికి గాను 75 టీఎంసీల వరకు నీరు నిల్వ అయ్యే అవకాశాలు ఉన్నాయి. జలాశయం ఎగువన ఉన్న మలెనాడు, అగొంబె, వర్నాడు, తీర్థనళ్లి, శివమొగ్గ, చిక్క మంగళూరు తదితర ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. అలాగే శివమొగ్గలోని అప్పర్‌తుంగా ప్రాజెక్టు (గాజనూరు జలాశయం) నుంచి వదులుతున్న దాదాపు 70 వేల క్యూసెక్కుల నీరు టీబీ డ్యాంలోకి చేరుతున్నాయి. టీబీ డ్యాం నిండే అవకాశ ఉండటంతో ఏ క్షణంలోనైనా క్రస్ట్ గేట్లు ఎత్తి తుంగభద్ర నదికి నీటిని విడుదల చేయవచ్చని బోర్డు అధికారులు చెబుతుఆన్నరు. ఇదిలా ఉండగా.. డ్యాం నుంచి దిగువ కాలువ(ఎల్లెల్సీ)కు వదిలిన నీరు ఆంధ్ర సరిహద్దు ప్రారంభం 135 కి.మీను దాటి హొళగుంద సెక్షన్‌లోకి ప్రవేశించాయి.



తుంగభద్ర జలాశయం

క్లుప్తంగా

భ్రామరీకి లక్ష కుంకుమార్చన



లక్ష కుంకుమార్చన సేవ నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబాదేవికి శనివారం పౌర్ణమి ఘడియలు ప్రారంభమవడంతో సాయంత్రం లక్ష కుంకుమార్చన సేవను శాస్త్రోక్తంగా జరిపించారు. శ్రీశైలానికి స్వయంగా రాలేని తెలుగు రాష్ట్రాలు, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర భక్తులు 17 మంది పరోక్షసేవలో పాల్గొన్నారు. అర్చకులు ముందుగా పూజాసంకల్పం పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహా గణపతి పూజను జరిపి శాస్త్రోక్తంగా లక్ష కుంకుమార్చన సేవను జరిపించారు.

ఏపీఎఫ్‌డీడీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా రామకృష్ణ



కర్నూలు కల్చరల్: ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ టీవీ డ్యాన్స్ మాస్టర్స్ డ్యాన్సర్స్ యూనియన్(ఏపీఎఫ్‌డీడీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షులుగా జిల్లాకు చెందిన సీనియర్ డ్యాన్స్ మాస్టర్ 'న్యూ సూపర్ డ్యాన్స్ అండ్ ఫిట్‌నెస్ అకాడమీ అధినేత దిమ్మె రామకృష్ణ ఎన్నికయ్యారు. అమరావతి తాడేపల్లిలోని ఏపీ ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో సినీ నిర్మాత రా జేంద్రప్రసాద్, సీనియర్ న్యాయవాది దుర్గా భవానీల సమక్షంలో నూతన కమిటీని ఎంపిక చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎన్నికైన రామకృష్ణకు కర్నూలు డ్యాన్స్ మాస్టర్స్ అసోసియేషన్ నాయకులు రఘు, మధు, శివ, నాగరాజు, సాగర్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ టీవీ, సినీ రంగాల్లోకి రావాలనుకునే జిల్లాకు చెందిన ఔత్సాహిక కళాకారుల ప్రతిభను రాష్ట్రస్థాయి సభ్యులుగా గుర్తించేలా, అవకాశాలు దక్కేలా కృషి చేస్తానన్నారు.

పార్ట్ టైం టీచర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(అర్బన్)/నంద్యాల(న్యూటౌన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో ఆంగ్ల మాధ్యమంలో పార్ట్ టైం (తాత్కాలిక) టీచర్‌గా విభిన్న స్థాయిల్లో (జేఎల్/పీజీటీ/టీజీటీ) పనిచేసేందుకు అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ జిల్లా కోఆర్డినేటర్ డా.ఐ శ్రీదేవి శనివారం ఒక ప్రకటనలో కోరారు. జేఎల్ 02 (మ్యాథ్స్ 01, ఫిజిక్స్ 01), పీజీటీ 04 (మ్యాథ్స్ 03, ఇంగ్లిషు 01), టీజీటీ 04 (ఇంగ్లిషు 02, ఫిజికల్ సైన్స్ 02) ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. బాలికల పాఠశాలలో స్త్రీలకు, బాలుర పాఠశాలలో పురుషులకు మాత్రమే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు పీజీ, బీఎడ్‌లో కనీసం ద్వితీయ శ్రేణి ఉత్తీర్ణత, టెట్‌లో అర్హత కలిగి ఉండాలని పేర్కొన్నారు. దరఖాస్తులను జిల్లా కోఆర్డినేటర్ కార్యాలయంలో ఈ నెల 22 నుంచి 25వ తేదీలోగా కార్యాలయ పనివేళల్లో అందించాలని సూచించారు. డీసీఓ కార్యాలయంలో ఈ నెల 26న డెమో నిర్వహిస్తామని, ఎంపిక, రద్దు చేసే అధికారం సెలక్షన్ కమిటీకి ఉన్నాయని తెలిపారు.

హత్య కేసు నిందితుడి అరెస్ట్

కర్నూలు సిటీ: ఈనెల 17న రైల్వే స్టేషన్ దారిలోని ఫుట్‌పాత్‌పై జరిగిన వ్యక్తి హత్య కేసు నిందితుడు పరశురాంను పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. రెండవ పట్టణ సీఐ ఇంతియాజ్‌బాషా తెలిపిన వివరాలు.. భిక్షాటన చేస్తూ జీవనం సాగించే శ్రీరాములు ఆచారి హత్యకు గురయ్యాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. బంగారు పేట బ్రిడ్జి వద్ద అనుమానాస్పదంగా ఉన్న హర్ష ఉరఫ్ పరశురాంను అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించగా హత్య చేసినట్లు ఒప్పుకున్నాడు. దీంతో నిందితుడిని కోర్టులో హాజరు పరచగా మెజిస్ట్రేట్ రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు.


వెదురుకు ఎదురేలేదు

- ఈ ఏడాది నుంచే వెదురు సాగుకు ప్రభుత్వం చర్యలు
- ఈ ఏడాది 20 హెక్టార్లలో నాటించేందుకు ప్రణాళికలు
- 50 శాతం సబ్సిడీ ఇస్తుండటంతో ఆసక్తి చూపుతున్న రైతులు

కర్నూలు(అగ్రికల్చర్): వెదురు సాగు చేసే అన్నదాతకు ఎదురే లేదు. రూ.20 వేల పెట్టుబడితో ఏడాదికి రూ.2 లక్షల వరకు ఆదాయం పొందవచ్చు. జాతీయ వెదురు మిషన్ సహకారంతో ఉద్యాన శాఖ ఆకర్షణీయమైన సబ్సిడీలు ఇచ్చి ప్రోత్సహిస్తుండటంతో ఇప్పటికే జిల్లాలో కొందరు రైతులు వెదురు సాగులో రాణిస్తున్నారు. వెల్దుర్తి, మద్దికెర, ఆస్పరి మండలాల్లో వెదురును గట్ల వెంట సాగు చేస్తున్నారు. ఇక ఈ ఏడాది 20 హెక్టార్లలో వెదురు నాటించేందుకు ఉద్యాన శాఖ.. జిల్లా అధికారులకు ప్రతిపాదనలు పంపింది. ఆమోదం లభించిన వెంటనే కార్యాచరణకు ఉపక్రమించనుంది.

వెదురు సాగుకు ప్రతిపాదనలు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జిల్లాలో వెదురు సాగును ప్రోత్సహించేందుకు చేసిన కసరత్తు ఇప్పుడు ఫలిస్తోంది. వెదురు సాగు కోసం యూనిట్ కాస్ట్, సబ్సిడీలు తదితర వాటిపై ప్రభుత్వం కోరిన మేరకు ఇటీవల జిల్లా ఉద్యాన శాఖ ప్రతిపాదనలు పంపింది. వెదురును గట్ల వెంట కానీ, పొలం మొత్తం కానీ సాగు చేయొచ్చు. మొదట 2024–25 ఏడాదికి



వెల్దుర్తి మండలం సూదేపల్లిలో పొలాల్లో బార్డర్‌గా నాటిన వెదురు

ప్రయోగాత్మకంగా 5 ఎకరాల్లో గట్ల వెంట(బార్డర్ క్రాప్), మరో 20 హెక్టార్లలో ప్రధాన పంటగా సాగు కోసం ప్రతిపాదనలు పంపారు.

సబ్సిడీలు ఇలా..

వెదురు సాగును జాతీయ బ్యాంబూ మిషన్ ప్రోత్సహిస్తోంది. రెవెన్యూ సిబ్బంది లేదా గ్రామ పంచాయతీలు ప్రభుత్వ భూముల్లో బ్లాక్ ప్లాంటేషన్ తరహాలో చేపడితే 100 శాతం సబ్సిడీ లభిస్తుంది. రైతులు తమ పొలాల చుట్టూ(బార్డర్) లేదా పొలంలో(బ్లాక్ ప్లాంటేషన్)సాగు చేసుకుంటే హెక్టారుకు యూనిట్ కాస్ట్ రూ.1 లక్షల ఉండగా 50 శాతం సబ్సిడీ లభిస్తుంది. ఇక రానున్న రోజుల్లో వెదురు నర్సరీలను కూడా ప్రోత్సహించనుంది. 2 హెక్టార్లలో వెదురు నర్సరీ ఏర్పాటు చేసుకుంటే యూనిట్ కాస్ట్ రూ.50 లక్షలు, హెక్టారులో నర్సరీ పెట్టుకుంటే యూనిట్ కాస్ట్ రూ.16 లక్షలు, అర హెక్టారులో నర్సరీ పెట్టుకుంటే యూనిట్ కాస్ట్ రూ.10 లక్షలు ఉంటుంది. సబ్సిడీ 50 శాతం ఉంటుంది.

ఇవీ ప్రయోజనాలు..

జాతీయ మార్కెట్‌లో వెదురుకు ఉన్న ప్రాధాన్యత అంతాఇంతా కాదు. వెదురును కొయ్య బొమ్మలుకు, పేపర్ తయారీకి ఉపయోగిస్తారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ నికరాదాయాన్ని ఇచ్చే పంట వెదురు. వెదురు అమ్మకం వల్ల వచ్చే లాభాలను పక్కనపెడితే ఇతరత్రా పంటలకు అనేక ప్రయోజనాలున్నాయి. గట్ల వెంట వెదురు మొక్కలు నాటుకుంటే ప్రధాన పంటలకు గాలుల నుంచి రక్షణతో పాటు భూమి కోతకు గురికాకుండా నివారిస్తుంది. వెదురు జీవిత కాలం 30 ఏళ్ల నుంచి 100 ఏళ్లు. ఎకరాకు రూ.20 వేలు పెట్టుబడి పెడితే ఏడాదికి రూ.2 లక్షల వరకు ఆదాయం ఉంటుంది. 3వ ఏడాది నుంచి దిగుబడి మొదలై 6వ ఏడాది నుంచి దిగుబడి గరిష్ట స్థాయికి చేరుతుంది.

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం



జిల్లాలో వెదురు సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. వెదురు అటవీ జాతి మొక్క. దీనిని పొలాల చుట్టూ నాటుకోవచ్చు. పొలంలో పంటగా కూడా సాగు చేసుకోవచ్చు. గ్రామ పంచాయతీలకు ఆదాయాన్ని పెంచుకునేందుకు ప్రభుత్వ భూముల్లో వెదురు మొక్కలు పెంచుకుంటే 100 శాతం సబ్సిడీ లభిస్తుంది. రైతులకైతే 50 శాతం సబ్సిడీ లభిస్తుంది.

– పి.రామాంజనేయులు, జిల్లా ఉద్యాన అధికారి, కర్నూలు

ప్రభుత్వాసుపత్రిలో డీసీహెచ్‌ఎస్ విచారణ



రికార్డులను పరిశీలిస్తున్న డీసీహెచ్‌ఎస్ డాక్టర్ ఆర్.మాధవి

ఎమ్మిగనూరు రూరల్: ప్రభుత్వాసుపత్రిలోని తుక్కు అక్రమంగా తరలించారనే ఆర్‌టీఏ ఫిర్యాదుపై శనివారం డీసీహెచ్‌ఎస్ డాక్టర్ ఆర్.మాధవి విచారణ చేపట్టారు. ప్రభుత్వాసుపత్రిలోని సూపరింటెండెంట్ కార్యాలయానికి చేరుకుని రికార్డులను పరిశీలించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న సూపరింటెండెంట్ డాక్టర్ మైత్రేయిని, ఫిర్యాదుదారుడు ఓంకార్‌ను, సిబ్బందిని విడివిడిగా విచారించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ నివేదికను ఆరోగ్య శాఖ కమిషనర్, జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. కాగా ఫిర్యాదుదారుడు ఓంకార్ విలేకరులతో మాట్లాడుతూ తాను ఎవరికీ ఫిర్యాదు చేయలేదన్నారు. తన పేరును ఎవరో ఫోర్జరీ చేసి ఫిర్యాదు చేశారని, అదే విషయాన్ని విచారణ అధికారికి చెప్పానని తెలపడం గమనార్హం.

వ్యక్తి దారుణహత్య



హత్యకు గురైన చాకలి చిన్న లింగస్వామి

పాములపాడు: వ్యక్తి దారుణహత్యకు గురైన ఘటన మండల కేంద్రం సమీపంలోని ఎస్ఆర్‌ఎమ్సీ వంతెన వద్ద చోటుచేసుకుంది. ఆత్మకూరు టౌన్ సీఐ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాలు.. ఇస్కాల గ్రామానికి చెందిన చిన్న లింగస్వామి(46) పొట్టేళ్ల వ్యాపారం చేస్తూ ఏడాది నుంచి పాములపాడులో నివాసం ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి 8.30 గంటల సమయంలో ఫోన్ రావడంతో భార్య చిట్టెమ్మకు చెప్పి టీవీఎస్ ఎక్స్‌ఎల్‌పై బయటకు వెళ్లాడు. రాత్రి 10 గంటలైనా ఇంటికి రాకపోవడంతో ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. ఇదే విషయాన్ని ఆమె బంధువులకు చెప్పడంతో వారు తెలిసిన చోటల్లా వెతికారు. ఈక్రమంలో రాత్రి 11 గంటల సమయంలో మండల కేంద్రం నుంచి 500 మీటర్ల దూరంలోని చెల్లిమిల్ల గ్రామ రోడ్డులో ఎస్ఆర్‌ఎమ్సీ వంతెన వద్ద ఓ వ్యక్తి రక్తపు మడుగులో పడి ఉన్నాడని తెలిసి అక్కడికి వెళ్లారు. చిన్న లింగస్వామిగా బంధువులు గుర్తించి బోరున విలపించారు. పోలీసుల సాయంతో మృతదేహాన్ని ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీ

విషయం తెలిసిన వెంటనే ఆత్మకూరు టౌన్ సీఐ లక్ష్మీనారాయణ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పేగులు టీవీఎస్ ఎక్స్‌ఎల్ అక్కడే పడి ఉండటాన్ని గమనించారు. కాగా మృతుడి సెల్ ఫోన్ లభ్యం కాలేదు. డాగ్ స్క్వాడ్ రంగంలోకి దింపారు. మృతదేహం ఉన్న ప్రదేశం నుంచి



ఘటనా స్థలంలో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ

డాగ్ మొదట ఎస్ఆర్ఎంసీ కాలువ గట్టుపైకి వెళ్లి, అటు నుంచి మద్యం దుకాణం వరకు వెళ్లి వచ్చింది. కాల్వ గట్టు ఎడమ వైపునకు వెళ్లింది. అక్కడి నుంచి నేరుగా చెలిమిల్ల రస్తా వెంట వెళ్లింది. కాగా మృతుడు పొట్టేళ్ల వ్యాపారం చేస్తుండటంతో డబ్బు ఉంటుందని దారి దోపిడీ దొంగలే హత్య చేశారా లేక ఎవరైనా ఫోన్ చేసి తీసుకెళ్లి హత్య చేశారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మృతుడికి భార్య చిట్టెమ్మ ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



మద్యం, కారు చూపుతున్న సెబ్ అధికారులు

కోడుమూరు రూరల్: స్థానిక పెట్రోల్ బంక్ వద్ద కర్ణాటక మద్యాన్ని సెబ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సెబ్ సీఐ రామాంజనేయులు తెలిపిన వివరాలు.. సెబ్ సిబ్బంది శనివారం వాహనాల తనిఖీ చేస్తుండగా కర్నూలు నుంచి కోడుమూరు వైపు వస్తున్న కారులో భారీగా కర్ణాటక మద్యం పట్టుబడింది. కర్ణాటక రాష్ట్రం రాయచూరుకు చెందిన ఇంతియాజ్, జిందావలి, కర్నూలు జిల్లా అరెకల్‌కు చెందిన తలారి నరసయ్య కారులో 27 బాక్స్‌ల్లో రూ.1,63,200 విలువ చేసే 2,592 టెట్రా ప్యాకెట్లను తరలిస్తున్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిని అరెస్ట్ చేశారు. ఇదే కేసుతో సంబంధం ఉన్న పెద్దకడబూరు మండలం కంబాలదిన్నె నాగేంద్రపై కూడా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపాశారు. తనిఖీల్లో సెబ్ ఎస్ఐ అలీబేగ్, సిబ్బంది అన్సర్‌బాషా, విరూపాక్షిరెడ్డి, శంకర్‌నాయక్, వెంకటేష్ నాయక్‌లు, ఇంటలిజెన్స్ కానిస్టేబుల్ నరసింహులు పాల్గొన్నారు.

మంత్రాలయం మండలంలో..

ఎమ్మిగనూరురూరల్: మంత్రాలయం మండలంలోనూ కర్ణాటక మద్యం భారీగా పట్టుబడింది. స్థానిక సెబ్ కార్యాలయ ఆవరణలో సెబ్ సీఐ భార్గవరెడ్డి వివరాలు విలేకరులకు వెల్లడించారు. మంత్రాలయం మండలం రాంపురం గ్రామ సమీపంలో తెల్లవారుజామున వాహనాలు తనిఖీ చేస్తుండగా కాచాపురం గ్రామానికి చెందిన మాదిగ ప్రేమ్‌కుమార్, మెదిలియర్ రవి, తెలుగు మాంతేష్, తుంగభద్రకు చెందిన హరికృష్ణ ఆటోలో సుమారు రూ.1,20,000 విలువ చేసే కర్ణాటక మద్యం తరలిస్తూ పట్టుబడ్డారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించినట్లు సీఐ తెలిపారు. తనిఖీల్లో కర్నూలు డీటీఎఫ్ సీఐ నరసానాయుడు, పీసీలు కరుణాకర్, బషీర్, షేక్షావలి, స్థానిక సెబ్ హెడ్‌కానిస్టేబుల్స్ లింగ ప్రసాద్, గోపాల్, కానిస్టేబుల్స్ భరత్, నరసింహారెడ్డి, లక్ష్మన్న పాల్గొన్నారు.

బాలల్లో నేర స్వభావాన్ని నియంత్రించాలి

- ప్రిన్సిపల్ మెజిస్ట్రేట్ జ్యోత్స్నాదేవి



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి

కర్నూలు (లీగల్): బాలల్లో నేర స్వభావాన్ని నియంత్రించి మంచి మార్గంలో నడిపించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ప్రిన్సిపల్ మెజిస్ట్రేట్ జ్యోత్స్నాదేవి సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి శనివారం జిల్లా కోర్టులోని న్యాయ సేవాసదన్‌లో బాలుల న్యాయ చట్టం గురించి అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అంతర్జాతీయ బాలల ఒడంబడిక ప్రకారం రాజ్యాంగంలో పొందుపరిచిన ప్రత్యేక నిబంధనలపై పోలీసు అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మెజిస్ట్రేట్ జ్యోత్స్నాదేవి మాట్లాడుతూ బాలల్లో నేర స్వభావాన్ని ప్రాథమిక దశలోనే గుర్తించి విద్యాబోధన ద్వారా మార్పు తీసుకురావాలన్నారు. ప్రజా వినియోగ సేవల కోసం శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షులు వెంకట హరినాథ్ మాట్లాడుతూ పలు రంగాలకు సంబంధించి ఎలాంటి సేవల్లో అయినా లోపం, నష్టం, అన్యాయం జరిగితే తక్షణమే తగిన ఆధారాలతో పర్మినెంట్ లోక్ అదాలత్‌లో వినతిపత్రం అందజేయాలన్నారు. ఎలాంటి కోర్టు ఖర్చులు లేకుండా అతి తక్కువ సమయంలో న్యాయం అందజేస్తారని తెలిపారు. మానసిక వైద్యనిపుణులు డాక్టర్ చైతన్య బాలుర మానసిక రుగ్మతలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో కర్నూలు ప్రభుత్వ బాలుర పరిశీలన గృహం సూపరింటెండెంట్ హుసేన్ బాషా, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎస్.మనోహర్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ జుబేదా, సీఐలు హాజీవలి, మమత తదితరులు పాల్గొన్నారు.

భారీగా ఆర్‌పీ ఎస్ఐల బదిలీ

కర్నూలు: రేంజ్ పరిధిలో 52 మంది ర్యాంక్ ప్రమోటీ ఎస్ఐలకు స్థాన చలనం కల్పిస్తూ శనివారం డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల ముందు కర్నూలు జిల్లా నుంచి కడప జిల్లాకు 8 మంది, అన్నమయ్య జిల్లాకు ఇద్దరు, అనంతపురం జిల్లాకు ఒకరు బదిలీపై వెళ్లారు. బదిలీల్లో భాగంగా తిరిగి వారు కర్నూలు జిల్లాకు వస్తున్నారు. అలాగే నంద్యాల జిల్లా నుంచి ఎన్నికల ముందు కడప జిల్లాకు నలుగురు, అన్నమయ్య జిల్లాకు ఐదుగురు, అనంతపురం జిల్లాకు ఆరుగురు కలిపి మొత్తం 15 మంది బదిలీపై వెళ్లారు. తిరిగి వారిని జిల్లాకు నియమిస్తూ డీఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే కర్నూలు జిల్లా నుంచి ఆరుగురు, నంద్యాల జిల్లా నుంచి 14 మంది ఎన్నికల ముందు వచ్చిన వారు తిరిగి కడప జిల్లాకు మొత్తం 20 మందికి స్థానచలనం కల్పిస్తూ డీఐజీ ఆదేశాలు జారీ చేశారు. అలాగే నంద్యాల జిల్లా నుంచి ఇద్దరు, కర్నూలు జిల్లా నుంచి ముగ్గురు అన్నమయ్య జిల్లాకు బదిలీ అయ్యారు.

ఒకే రోజు ఐదు దుకాణాల్లో చోరీ



సీసీ కెమెరాలో రికార్డు అయిన చోరీ దృశ్యం

బనగానపల్లె రూరల్: పట్టణంలో ఒకే రోజు ఐదు దుకాణాల్లో గుర్తు తెలియని దుండగుడు చోరీలకు పాల్పడ్డాడు. బాధితులు తెలిపిన వివరాలు.. శుక్రవారం రాత్రి దుకాణాదారులు తమతమ దుకాణాలను మూసేసి ఇళ్లకు వెళ్లారు. అర్ధరాత్రి దాటిన తర్వాత ముఖానికి మాస్క్, కంటి అద్దాలు ధరించిన ఓ దుండగుడు పాత ఆంధ్రాబ్యాంకు రోడ్డులో ఉన్న రజాక్ సెల్ పాయింట్ తాళాలను రాడ్‌తో ధ్వంసం చేశాడు. అయితే లోపల నుంచి కూడా షటర్‌కు తాళం వేయడంతో దుండగుడు అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఈ దృశ్యాలు అక్కడి సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. అనంతరం ఆస్థానం వద్ద ఉన్న కిరణ్ సెల్ పాయింట్ తాళం తొలగించి లోపలకు వెళ్లి నాలుగు మొబైల్స్, రూ.10 వేల నగదు చోరీ చేశాడు. తెల్లవారు జామున రెండు గంటల ప్రాంతంలో జీఎం టాకీస్ సమీపంలోని నవీద్ ట్రేడర్స్ సిమెంట్, ఐరన్ షాపులకు సంబంధించిన షట్టర్ తాళాలు తొలగించి లోపలకు వెళ్లగా అక్కడ ఎలాంటి నగదు లభించకపోవడంతో ఎదురుగా ఉన్న మల్లికార్జున కిరాణం దుకాణంలోకి వెళ్లాడు. అక్కడ రూ.10 వేల విలువ చేసే సిగరెట్లు, రూ.3 వేల నగదు, హుండీలోని మరో రూ.3 వేలు చోరీ చేశాడు. మరో చాయ్ హట్ టీ స్టాల్ షట్టర్ తాళం తొలగించి అందులోని మొబైల్‌తో పాటు కొంత నగదు ఎత్తుకెళ్లినట్లు బాధితులు ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ గంటా సుబ్బారావు ఆయా దుకాణాలను పరిశీలించి బాధితులతో వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

22న మున్సిపల్ టీచర్లకు పదోన్నతుల కౌన్సెలింగ్

కర్నూలు (సిటీ): ఈనెల 22న మున్సిపల్ టీచర్లకు పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు డీఈఓ కె.శామ్యూల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని మున్సిపల్ కార్పొరేషన్, ఇతర మున్సిపల్ స్కూళ్లలో పని చేస్తున్న ఎస్‌జీటీ, తెలుగు పండిట్ల సీనియారిటీ జాబితా వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు. సీనియారిటీ ఉన్నవారు ఈనెల 22న ఉదయం 10 గంటలకు డిప్యూటీ ఈఓ ఆఫీస్‌లో ఏర్పాటు చేసిన కౌంటర్‌లో విద్యార్హతల ధ్రువీకరణ, సర్వీస్ రిజిస్టర్‌ను వెరిఫై చేయించుకోవాలన్నారు.

చిన్నారులకు టీకాలు తప్పనిసరి

కర్నూలు(హాస్పిటల్): చిన్నారులకు, గర్భిణులకు క్రమం తప్పకుండా టీకాలు వేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్ సూచించారు. జొహరాపురం యూపీహెచ్‌సీ–2 పరిధిలోని కిందిగేరి సచివాలయంలో శనివారం జరుగుతున్న వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని డీఎంహెచ్‌ఓ తనిఖీ చేసి గర్భిణులు, పిల్లలకు సంబంధించిన వ్యాక్సినేషన్ రికార్డులు, రిపోర్టులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణుతులు, ఐదేళ్లలోపు చిన్నారులకు క్రమం తప్పకుండా టీకాలు ఇవ్వడం వల్ల పిల్లలకు వ్యాధులు దరిచేరవన్నారు. కార్యక్రమంలో డీసీఎం ప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పామాయిల్ సాగు లాభసాటి

- జిల్లా ఉద్యాన శాఖ అధికారి నాగరాజు



మాట్లాడుతున్న జిల్లా ఉద్యాన శాఖ అధికారి నాగరాజు

మిడుతూరు: పామాయిల్ సాగు లాభసాటిగా ఉంటుందని జిల్లా ఉద్యాన శాఖ అధికారి నాగరాజు తెలిపారు. శనివారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో రైతులకు పామాయిల్ సాగుపై అవగాహన కల్పించారు. పామాయిల్ సాగుకు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ వివరాలు, రైతుల సందేహాలను ఆయన నివృత్తి చేశారు. పామాయిల్ పంటపై రైతులకు అవగాహన కోసం తూర్పు గోదావరి జిల్లాలో పామాయిల్ తోటల సందర్శనను చేపడతామన్నారు. దేశంలో కెల్లా ఆంధ్రప్రదేశ్‌లోనే ఆయిల్ ఫాం తోటల సాగు అత్యధికంగా ఉందన్నారు. నాలుగు కంపెనీలు మొదట 6 జిల్లాల్లో కొత్తగా ఆయిల్ ఫాం సాగును ప్రోత్సహిస్తామని రెండేళ్ల క్రితం ముందుకు వచ్చాయన్నారు. ఒక్కో మండలానికి ఒక్కో కంపెనీకి ప్రభుత్వం కేటాయిస్తుందన్నారు. పామాయిల్ సాగు కోతకు రావడానికి నాలుగేళ్లు పడుతుందన్నారు. తర్వాత వరుసగా మూడు నెలలు కాస్తూనే ఉంటుందన్నారు. పెట్టుబడి లేనిదని, కాంప్లెక్స్ ఎరువు, గేదెల ఎరువు చెట్టుకు ఎంత అందిస్తే అంత బలంగా పెరుగుతుందన్నారు. మార్కెట్‌లో ఎకరాకు రూ.80 వేల ఆదాయం వస్తుందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఉద్యాన శాఖ అధికారి తేజస్విణి, మండల వ్యవసాయ అధికారి పీరునాయక్, 3ఎఫ్ సంస్థ జనరల్ మేనేజర్ విజయప్రసాద్, అసిస్టెంట్ మేనేజర్ నాగరాజు పాల్గొన్నారు.